ప్రజాశక్తి
మంగళవారం 4 జూన్ 2024
8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

నిమ్రా కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు

నేడు ఉత్కంఠకు తెర

- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- కేంద్రాల వద్ద మూడంచల భద్రత, 144 సెక్షన్
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, తర్వాత ఈవిఎంలు
- మధ్యాహ్నం నుంచి ఒక్కొక్కటిగా ఫలితాలు
- ఉమ్మడి కృష్ణాలో తేలనున్న 207 మంది అభ్యర్థుల భవితవ్యం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్లు డిల్లీరావు, బాలాజీ

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి, విజయవాడ

అటెన్షన్... గత నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చివరి ఘట్టం కౌంటింగ్‌పై ఉత్కంఠకు మంగళవారంతో తెరపడనుంది. మరి కొద్దిసేపట్లో ప్రజాతీర్పు ఇవిఎంలను దాటుకుని బయటకు రానుంది. ఎన్నికల ఫలితాలపై అభ్యర్థులు, పార్టీ నేతల్లో మాత్రమే కాదు సాధారణ ప్రజల్లోనూ టెన్షన్ నెలకొంది. ఏ పార్టీ పీఠం ఎక్కబోతోంది? ఏ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారు? అని అందరూ ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. ఓ వైపు కౌంటింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. పోలీసులు భద్రతపై దృష్టి పెట్టారు. మరోవైపు బెట్టింగ్ రాయుళ్లు సైతం సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు. రౌండ్ రౌండ్‌కు బెట్టింగ్ కాసేందుకు సై అంటున్నారు. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో మొత్తం 14 అసెంబ్లీ స్థానాలకు, రెండు ఎంపి స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కృష్ణాజిల్లాలోని బందరు పార్లమెంట్‌తో పాటు బందరు, అవనిగడ్డ, పెడన, పామర్రు, గుడివాడ, గన్నవరం, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 94 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి విజయవాడ పార్లమెంట్‌తో పాటు విజయవాడ పశ్చిమ, తూర్పు, సెంట్రల్, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నియోజకవర్గాలకు 113 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కృష్ణాజిల్లాకు సంబంధించి మచిలీపట్నం పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీల్లో

లెక్కించనున్నారు. ఎన్‌టిఆర్ జిల్లాకు సంబంధించి ఇబ్రహీంపట్నం, జూపూడిలోని నోవా కళాశాలలో తిరువూరు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, నందిగామ నియోజకవర్గాలకు, నిమ్రా కళాశాలలో విజయవాడ తూర్పు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభంకానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. అనంతరం ఈవిఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభంకానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. అనంతరం ఈవిఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. ప్రతి నియోజకవర్గంలో లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కింపు పూర్తయిన నియోజకవర్గాల ఫలితాలు ఒక్కొక్కటిగా విడుదల చేస్తారు. పోలీసులు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచల భద్రత, 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. అనుమతి లేని ఎవ్వరిని కౌంటింగ్ కేంద్రం వద్దకు అనుమతించరు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది సైతం తమకు ఇచ్చిన అనుమతిపత్రాలను వెంట తీసుకెళ్లాలి.

... పూర్తి వార్తలు లోపలి పేజీల్లో

అతిసార బారిన మరో ఇద్దరు

మృతుల కుటుంబాలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పరామర్శ

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడలో మరో ఇద్దరు అతిసార బారిన పడ్డారు. తూర్పు నియోజకవర్గం ఏడో డివిజన్ సిద్ధార్థ కళాశాల సమీపంలో ఉన్న లలిత ఎలైట్స్ లాడ్జీలో జరుగుతున్న ఓ కార్యక్రమంలో పాల్గొన్న పటమట భారతి, ఎనిమిది నెలల షర్విల్ కలుషిత నీరు తాగి వాంతులు, విరేచనాల బారిన పడ్డారు. తూర్పు సిటీ సిపిఎం నాయకులు పి.మురహరి కోడలు అయిన భారతి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరేందుకు మంగళవారం బయలుదేరి వెళ్లాల్సి ఉండగా అతిసార బారిన పడటంతో మూడు రోజుల పాటు మందులు వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. విజయవాడ రూరల్ నున్న-అడవినెక్కలం దగ్గర ఎన్‌డిఆర్‌ఎఫ్ కానిస్టేబుల్ కుమారుడైన షర్విల్‌కు కూడా అతిసార లక్షణాలతో నీరశించినట్లు తలిదండ్రులు తెలిపారు. గత మూడు రోజుల క్రితం ఓ కార్యక్రమానికి ఎలైట్ లాడ్జీలోని ఒక గదిని కిరాయికి తీసుకొని పలువురు బంధువులు దానిలో దిగారు. లాడ్జీకి సరఫరా అవుతున్న మురుగునీరు, దుర్వాసనతో కూడిన నీటిని తాగడం వల్లనే భారతితో పాటు షర్విల్ అతిసార బారిన పడినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. లాడ్జీ నిర్వహణ పట్ల బాధితులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ అధ్వాన్నంగా ఉండటంతో పాటు నీటి కాలుష్యంతో పలువురు అతిసార బారిన పడటం పట్ల ఆ లాడ్జీ యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేయడమే కానీ కనీస వసతి కల్పించకపోగా, నీరు కూడా మురుగులతో అధ్వాన్నంగా ఉండి, దానినే తాగాల్సి వస్తుండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడాల్సి వస్తోందని, దీనిపై నగపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని మురహరి డిమాండ్ చేశారు. డాక్టర్ల సలహా మేరకు ఇళ్ల వద్దనే వారిద్దరికీ చికిత్స అందిస్తున్నారు. అయితే ఇప్పటికే అతిసారతో బాధపడుతున్న అనేక మంది నేటికీ ఆయా ప్రయివేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.

పైపులైన్‌ను పరిశీలిస్తున్న రామకృష్ణ

మృతుల కుటుంబాలకు రామకృష్ణ పరామర్శ

కలుషిత నీరు తాగి అతిసారతో మొగల్రాజపురంలో మరణించిన వల్లూరి దుర్గారావు, కాకర్లమూడి ఇందిరా, శిఖ ఇందిరా తదితర మృతుల కుటుంబాలను (మిగతా 2లో)

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

పాలస్తీనాపై నరమేధాన్ని ఖండించండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష నేతలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని, ఇజ్రాయెల్‌కు భారత ప్రభుత్వం చేస్తున్న ఆయుధ సరఫరాను నిలిపివేయాలని పలువురు వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న నరమేధాన్ని ఖండించాలని, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని కోరుతూ మచిలీపట్నంలోని జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం సోమవారం నిర్వహించారు. రఫా పట్టణంపై అమానుష నరమేధాన్ని ఆపాలని, పాలస్తీనాలో వెంటనే కాల్పులు విరమించాలని, పాలస్తీనాను స్వతంత్ర దేశంగా ప్రకటించాలని, ఇజ్రాయెల్ కు భారత ప్రభుత్వం చేస్తున్న ఆయుధ సరఫరా వెంటనే నిలిపివేయాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ పాలస్తీనాలో కాల్పులు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రఫా పట్టణంపై (మిగతా 2లో)

నిమ్రా వద్ద భద్రతా ఏర్పాట్లు

నేడు ఉత్కంఠకు తెర

- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, తర్వాత ఈవిఎంలు
- మధ్యాహ్నం నుంచి ఒక్కొక్కటిగా ఫలితాలు
- ఉమ్మడి కృష్ణాలో తేలనున్న 207 మంది అభ్యర్థుల భవితవ్యం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పర్వం తుదిదశకు చేరుకుంది. కృష్ణాజిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనుంది. కృష్ణాజిల్లా మచిలీపట్నం పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లను మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్శిటీలో లెక్కించనున్నారు. దీనికి సంబంధించి జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం ఎనిమిది గంటలకు కౌంటింగ్ ప్రారంభంకానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. అనంతరం ఈవిఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. ప్రతి నియోజకవర్గంలో లెక్కింపుకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా లెక్కింపు పూర్తయిన నియోజకవార్గల ఫలితాలు ఒక్కొక్కటిగా విడుదల చేస్తారు. పోలీసులు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచల భద్రత, 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ప్రతి టేబుల్‌కు పోటీ చేసే అభ్యర్థులకు ఒక్కో కౌంటింగ్ పాస్ ఇచ్చారు. వాటిని పరిశీలించిన తర్వాతే కౌంటింగ్ సెంటర్‌కు అనుమతిస్తారు. ఈ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, సిగరెట్లు, వాటర్ బాటిళ్లను అనుమతించరు. ఉదయం నాలుగున్నరకు ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఆరు గంటలకు కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. పోలింగ్ కేంద్రానికి రెండు కిలో మీటర్ల వరకు పోలీసు ఆంక్షలు ఉంటాయి. విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు.

కృష్ణాలో తేలనున్న 94 మంది భవితవ్యం

కృష్ణాజిల్లాలోని బందరు పార్లమెంట్‌తో పాటు బందరు, అవనిగడ్డ, పెడన, పామర్రు, గుడివాడ, గన్నవరం, పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 94 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధానంగా పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి వైసిపి అభ్యర్థులు ఎనిమిది మంది పోటీ చేశారు. పార్లమెంట్, అవనిగడ్డ అసెంబ్లీకి జనసేన అభ్యర్థులు పోటీ చేశారు. మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఇండియా వేదిక నుంచి పార్లమెంట్‌తో పాటు ఏడు నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు పోటీ చేశారు. గన్నవరంలో సిపిఎం అభ్యర్థి పోటీ చేశారు. ఓటింగ్ పూర్తయినప్పటి నుంచి 21 రోజులుగా వీరంతా ఫలితాల కోసం ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. కౌంటింగ్ నేపథ్యంలో నేటితో అభ్యర్థి భవితవ్యం తేలనుంది.

కృష్ణాజిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

అసెంబ్లీ పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం	పోస్టల్ ఓట్లు	హోం ఓట్లు	మొత్తంపోలైన ఓట్లు	శాతం
1.గన్నవరం	2,79,054	2,36,848	84.88	2,425	272	2,39,545	85.84
2.గుడివాడ	2,04,271	1,68,537	82.51	3,066	160	1,71,763	84.09
3.పెడన	1,67,564	1,48,413	88.57	1,533	117	1,50,063	89.56
4.మచిలీపట్నం	1,96,680	1,61,109	81.91	3,745	192	1,65,046	83.92
5.అవనిగడ్డ	2,12,331	1,82,600	86.00	3,444	395	1,86,439	87.81
6.పామర్రు (ఎస్‌సి)	1,84,632	1,62,683	88.11	1,981	222	1,64,886	89.31
7.పెనమలూరు	2,94,928	2,33,413	79.14	3,220	367	2,37,000	80.36
జిల్లా మొత్తం	15,39,460	12,93,603	84.45	19,414	1,725	13,14,742	85.40

ఎన్‌టిఆర్ జిల్లాలో కౌంటింగ్‌కు అంతా సిద్ధం

ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లాలో 113 మంది అభ్యర్థుల భవితవ్యం మంగళవారం తేలనుంది. ఎన్నికలు పూర్తయిన మూడు వారాల తరువాత జరుగుతున్న కౌంటింగ్ ప్రక్రియ, జయాపజయాలపై అటు అభ్యర్థుల్లోనూ, ఇటు ఓటర్లలోనూ ఉత్కంఠ నెలకొంది. విజయవాడ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం 96 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే పార్లమెంట్ నియోజకవర్గానికి 17 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇండియా వేదిక తరుపున కాంగ్రెస్ విజయవాడ పార్లమెంట్‌తో పాటు ఐదు నియోజకవర్గాల్లో, సిపిఎం ఒకటి, సిపిఐ ఒక నియోజకర్గంలో పోటీ చేస్తుండగా, ఎన్‌డిఎ మిత్రపక్షం తరుపున బిజెపి ఒక నియోజకవర్గంలో పోటీ చేస్తుంది. వైసిపి అన్ని నియోజకవర్గాలకు పోటీ చేస్తుండగా, పార్లమెంట్‌తో పాటు ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు టిడిపి అభ్యర్థులు పోటీ చేశారు. కౌంటింగ్‌కు సంబంధించి అధికారులు అన్ని రకాలుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇబ్రహీంపట్నం, జూపూడిలోని నోవా కళాశాలలో తిరువూరు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, నందిగామ నియోజకవర్గాలకు, నిమ్రా కళాశాలలో విజయవాడ తూర్పు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈవీఎం కౌంటింగ్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఈవీఎం కౌంటింగ్ పార్లమెంటరీ నియోజకవర్గంకు ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం కౌంటింగ్‌కు టేబుళ్లు ఏర్పాటు చేశారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 17,596 పోస్టల్ బ్యాలెట్లతో పాటు ఇప్పటివరకు 153 ఈటీపీబీఎస్ ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. వీటి లెక్కింపును రెండు రౌండ్లలో పూర్తిచేసే విధంగా అధికారులు సిద్ధం చేశారు. ఒక్కో రౌండ్‌కు దాదాపు మూడు గంటల సమయం పడుతుంది. మొత్తం కౌంటింగ్ ప్రక్రియను సాయంత్రం ఐదారు గంటల్లోగా పూర్తి చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు

ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ (వీఎఫ్‌సీ), పోస్టల్ ఓటింగ్ సెంటర్ (పీవోసీ), హోం ఓటింగ్, ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) ద్వారా వచ్చిన పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపును అత్యంత పారదర్శకంగా నిర్వహించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి టేబుల్‌కు కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్ ఉంటారు. ఒక్కో టేబుల్‌కు కేటాయించిన అధికారుల బృందం పూర్తిస్థాయిలో సమన్వయంతో పనిచేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఫారం-13సీ, ఫారం-13ఏ (డిక్లరేషన్), ఫారం-13బీ స్థాయిల్లో రిజెక్షన్ల నిబంధనలు, డిక్లరేషన్‌లో సీరియల్ నంబరు, ఓటరు సంతకం, అటెస్టర్ సంతకం తదితరాలతో పాటు బ్యాలెట్‌లో మార్కింగ్, ట్యాబ్యులేషన్ తదితరాలకు సంబంధించిన అంశాల ఆధారంగా ఏర్పాట్లు చేశారు. 50 చొప్పున ఉన్న పోస్టల్ బ్యాలెట్ల కట్టలను వేరుచేసి సజావుగా లెక్కించే విధానాన్ని అమలు చేస్తారు. కౌంటింగ్ ప్రక్రియకు 301 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 402 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 308 మంది మైక్రో అబ్జర్వర్లు మొత్తంగా 1,011 మంది కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్‌ను ఎన్ఐసి ఆన్‌లైన్‌లో జిల్లా ఎన్నికల అధికారులు పూర్తి చేశారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఓట్ల లెక్కింపు పరిశీలకులుగా అనిల్ బంకా (విజయవాడ తూర్పు నియోజకవర్గం), గౌరీష్ ఎస్ కుర్తికర్ (నందిగామ), అభిషేక్ దావన్ (విజయవాడ సెంట్రల్), మంజూ రాజ్‌పాల్ (తిరువూరు, విజయవాడ పశ్చిమ), నరీందర్ సింగ్ బాలి (మైలవరం), బిఆర్ సాగర్ (జగ్గయ్యపేట) ఉన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా కేంద్రం, గుర్తింపు కార్డులు, ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో ప్రవేశం, నిష్క్రమణ ప్రణాళిక అమలు, సైన్ బోర్డులు తదితరాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు మీడియా సెంటర్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, సీసీటీవీలు, ఐటీ సిస్టమ్స్, భద్రత, ఈటీపీబీఎస్/పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు ఏర్పాట్లు, కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ, ఫలితాల వెల్లడికి చర్యలు, సమర్పించాల్సిన నివేదికలు, ఈవిఎంల సీలింగ్‌పై ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారి డిల్లీరావు సిద్ధం చేశారు.

నోవా, నిమ్రాల్లో ఓట్ల లెక్కింపు

కౌంటింగ్ సెంట్రల్-1 నోవా ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తారు. వీటికి సంబంధించి తిరువూరు నియోజకవర్గంలో 234 పోలింగ్ స్టేషన్లు ఉండగా కౌంటింగ్ కోసం 14 టేబుల్స్ ఏర్పాటు చేయగా, 17 రౌండ్స్‌లో ఓట్ల లెక్కింపును పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. విజయవాడ పశ్చిమ 253 పోలింగ్ స్టేషన్లకు 19 రౌండ్లలో, విజయవాడ సెంట్రల్ 267 పోలింగ్ స్టేషన్లకు 20 రౌండ్లలో, నందిగామ 222 పోలింగ్‌స్టేషన్లకు 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. కౌంటింగ్ సెంటర్-2 నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో మూడు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్లను లెక్కిస్తారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని 298 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్స్‌లో, మైలవరం 296 పోలింగ్ కేంద్రాలకు 22 రౌండ్స్‌లో, జగ్గయ్యపేట 222 పోలింగ్ కేంద్రాలకు 16 రౌండ్స్‌లో లెక్కింపు పూర్తి చేస్తారు.

పార్కింగ్‌తో పాటు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బందిని ఉదయం ఆరు గంటలకల్లా చేర్చేందుకు ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంతో పాటు కేతనకొండ, కొండపల్లి, ఇబ్రహీంపట్నం సర్కిల్ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేశారు. పార్కింగ్‌కు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా నోవా, నిమ్రా కళాశాలలతో పాటు జాతీయ రహదారి పాయింట్ వద్ద పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఆర్‌వోలు, అబ్జర్వర్లు, ఈటీపీబీఎస్ ఓటీపీ వచ్చే ఫోన్లకు మాత్రమే కౌంటింగ్ హాల్లోకి అనుమతి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేక ఎంట్రీ పాయింట్ ఉంటుంది. వీరి మొబైళ్ల ఫోన్లకు మీడియా సెంటర్ వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. కౌంటింగ్ స్టాఫ్, కౌంటింగ్ ఏజెంట్లు తదితరుల మొబైళ్లకు అనుమతి లేనందున వారి ఫోన్లను భద్రపరిచేందుకు ప్రత్యేకంగా కలెక్షన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తాగునీరు, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా చర్యలు తీసుకున్నట్లు జిల్లా అధికారులు వివరించారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోస్టల్ ఓట్లు	పోలైన మొత్తం ఓట్లు	శాతం	2019లో	2014లో
1.తిరువూరు (ఎస్‌సి)	2,07,190	1,81,669	2,710	1,84,379	88.99	86.07	86.60
2.విజయవాడ పశ్చిమ	2,55,963	1,70,104	1,795	1,71,899	67.16	66.17	64.01
3.విజయవాడ సెంట్రల్	2,77,724	2,02,635	2,866	2,05,501	73.99	65.73	65.20
4.విజయవాడ తూర్పు	2,70,624	1,93,026	3,150	1,96,176	72.49	67.50	65.87
5.మైలవరం	2,81,732	2,40,487	2,536	2,43,023	86.26	89.60	85.29
6.నందిగామ (ఎస్‌సి)	2,05,480	1,79,915	2,206	1,82,121	88.63	88.01	84.96
7.జగ్గయ్యపేట	2,05,364	1,84,575	2,311	1,86,886	91.00	89.53	89.00
జిల్లా మొత్తం	17,04,077	13,52,411	17,574	13,69,985	80.39	78.94	77.28

మొదటిపేజీ తరువాయి

అతిసార బారిన మరో ఇద్దరు

సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. సిపిఎం కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడ నగరంలో కలుషిత నీరు తాగి తొమ్మిది మంది చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. గ్రామాలలో, కొన్ని పల్లెల్లో మెరుగైన సౌకర్యాలు లేకనో, అధికారుల నిర్లక్ష్యం వల్లనో ఇలాంటి దుర్ఘటనలు జరుగుతాయన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్ని సౌకర్యాలు, సదుపాయాలు ఉన్నా, కేవలం మంచినీటి సరఫరా అధికారుల నిర్లక్ష్యం వలనే మొగల్రాజపురంలో ఆరుగురు, పాయికాపురంలో ముగ్గురు కలుషిత నీరు తాగి మరణించడం బాధాకరమన్నారు. ఈ ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్లను పరిశీలిస్తే తుప్పు పట్టి పాడైపోయిన పైపులైన్లకు రబ్బరు తొడిగి నీటి సరఫరా చేయటం సరికాదన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారాన్ని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు పి దుర్గాంబ, 6, 7 డివిజన్ల ఇన్‌ఛార్జి అప్పరబోతు రాము తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై నరమేధాన్ని ఖండించండి

అమానుష దాడిని వెంటనే నిలిపివేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ పాలస్తీనా దేశంపై ఇజ్రాయెల్ దాడిని ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ నియోజకవర్గ మచిలీపట్నం కార్యదర్శి లింగం ఫిలిప్, ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షులు బాష, కార్యదర్శి అజీజ్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్, సిపిఎం నాయకులు కె.శర్మ, ఎస్.ధనుంజయరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.పోలినాయుడు, కె.వి.గోపాలరావు, సిఐటియు మచిలీపట్నం కార్యదర్శి సిహెచ్ జయరావు, ఏఐటీయూసీ పట్టణ నాయకులు ఓ.ఎల్ రావు, మహిళా సమైక్య నాయకురాలు బడుగు రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుండడంతో కౌంటింగ్ కేంద్రం వద్ద విధులకు హాజరయ్యే పోలీసు అధికారులకు, సిబ్బందికి సోమవారం జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఐపిఎస్ , అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి వెంకటేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్ వి డి ప్రసాద్ తో కలసి బ్రీఫింగ్ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసి కీలక సూచనలు చేశారు. విధుల పట్ల ప్రతి ఒక్కసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం ఏమరపాటు వహించిన భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కేటాయించిన డ్యూటీ పాయింట్లలోనే ఉంటూ, ఏ సమస్య ఉన్న వెనువెంటనే మీ ఇన్చార్జ్ అధికారికి తెలియజేసి సమస్యను పరిష్కరించు కోవాలని తెలిపారు. అందరి సహకారంతో పోలింగ్ ప్రక్రియను సజావుగా ముగించామని, అలాగే అదే స్ఫూర్తితో కౌంటింగ్ ప్రక్రియ కూడా విజయవంతంగా ముగిసేలా చూడాలని తెలిపారు. ప్రతి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్స్ వద్ద ఏర్పాటు చేసి ఉన్న యాక్సిస్ కంట్రోల్ ల ద్వారా ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, రిటర్నింగు అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి కౌటింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని, వారి వెంట ఎటువంటి పదునైన ఆయుధాలను, ప్రమాదకర వస్తువులను వెంట తీసుకు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కౌంటింగు కేంద్రాలకు విచ్చేసే కౌంటింగు ఏజంట్ల వాహనాలను, ప్రత్యేకంగా నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని, కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లకు పాల్పడే వ్యక్తులను వెంటనే పికప్ వాహనాలలో ఎక్కించాలని, ఎవరైనా గొడవలకు పాల్పడతారని అనుమానం ఉంటే వారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి, అధికారుల ఆదేశాల మేరకు చర్యలకు ఉపక్రమించాలన్నారు. అందరూ సమయపాలన పాటిస్తూ ప్రతి ఒక్కరు ఐ డి కార్డు, విజిల్, డ్యూటీ పాస్ పోర్ట్ లతో ఎవరికి నిర్ణయిం చిన ప్రదేశాలల్లో వారు హాజరవ్వాలని, విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉమాకాంత్‌కు సపరిచర్యలు చేస్తున్న దృశ్యం

మంగినపూడి బీచ్‌లో విషాదం

- ఓ యువకుడు గల్లంతు, మరో యువకుడి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మంగినపూడి బీచ్‌లో విషాదం చోటుచేసుకుంది. విహార యాత్రకని బీచ్‌కి వచ్చి ఓ యువకుడు గల్లంతవ్వగా మరో యువకుడు కొట్టుకుపోతుండగా స్థానికులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉయ్యూరుకు చెందిన తొమ్మిది మంది యువకులు సోమవారం మంగినపూడి బీచ్‌కు వచ్చారు. స్నేహితులంతా కలసి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా అలలు రావడంతో భాను అనే యువకుడు లోపలికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. మరో యువకుడు ఉమాకాంత్ కొట్టుకు పోతుండగా స్థానికులు కాపాడారు. ఉమాకాంత్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా పోలీసులు తెలిపారు.

పోలీసులకు సహకరించాలి : ఎస్ఐ

ఎస్ఐ సత్యనారాయణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఈ నెల 4వతేదీన ఎలక్షన్ కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో గుడ్లవల్లేరు మండలంలోని ప్రజలు, నాయకులు అందరూ పోలీసు వారికి సహకరించాలని గుడ్ల వల్లేరు ఎస్సై జి. సత్య నారాయణ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ అనంతరం ఎవరికీ కూడా విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదని అదే విధంగా జిల్లాలో 144 సెక్షన్ మరియు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ఎవరూ కూడా నలుగురు లేదా అంతకన్నా ఎక్కువ మంది గుమ్ముగూడి ఉండరాదని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం డీజేలకు గాని, మందు గుండు సామాగ్రి పేల్చడానికి, పెట్రోల్/ డీజిల్ లూజ్ అమ్మడానికి గాని అనుమతులు లేవని అన్నారు. వాటినీ అతిక్రమించినయడల డిజె సామాను ప్రొవైడ్ చేసిన యజమాని, అదేవిధంగా మందు గుండు సామాగ్రి అమ్మిన ఓనర్లపై మరియు పెట్రోల్ బంక్ యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగా యువత ఎవరూ కూడా అనవసరంగా కేసుల్లో ఇరుక్కుని వారి విలువైన భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని కోరారు.

విద్యార్థుల పుస్తక పఠనం

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థి విద్యార్థులకు పుస్తక పఠనం. కథలు చెప్పారు. విద్యార్థులకు శారీరకమైన మానసికమైన బలాన్ని చేకూర్చే యోగ చేయించడం, 12 రకాల సూర్య నమస్కారాల భంగిమలు చేయించడం నేర్పించారు. పోటీ ప్రపంచానికి అనుగుణంగా జనరల్ నాలెడ్జ్ పెంపొందించటంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని శాఖ గ్రంథాలయ అధికారి కే గణేష్ కుమార్ నిర్వహించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులచే నీతి కథలు చదివించి, చెప్పించడం నిర్వహించారు. వంశీకష్ణ అనే విద్యార్థి పేదరికంలో చదివి పైలెట్ అయ్యే స్థాయికి ఎలా వెళ్ళటం జరిగిందో వివరించారు. బాలికలకు క్రాఫ్ట్ వర్క్ లో భాగంగా పేపర్తో గులాబీ పువ్వులు తయారుచేయు విధానాన్ని జి.టి దేవి నేర్పించారు. బాలురకు ఫ్రాగ్ జెంపింగ్ ఆటల పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిని టి వాణి తెలిపారు. **ప్రజాశక్తి - గుడివాడ :** స్థానిక రాజేంద్రనగర్‌లోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. సోమవారం మాజీ గ్రంథాలయ ఉద్యోగి దుగ్గిరాల ఆనందమోహనబోసు, సాహితి స్రవంతి నిర్వహకుడు లంకా సురేంద్రలు విద్యార్థులకు దేశ నాయకులు, ఉద్యమ నేతల గురించి తెలిపి పలు కథలపై శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకురాలు పి.శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

చల్లపల్లిలో...

గుడివాడలో...

గుడ్లవల్లేరులో...

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-చల్లపల్లి : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు మంగళవారం విడుదల కానున్న నేపథ్యంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చల్లపల్లి సిఐ సిహెచ్ నాగప్రసాద్ హెచ్చరించారు. సోమవారం చల్లపల్లి ప్రధాన సెంటర్లో ఎస్సై చిన్నబాబు, సిబ్బందితో కలిసి ముళ్ళ కంచె వేసి మాక్ డ్రిల్ల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ బాధ్యతతో మెలగాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుండి ముగిసే వరకు పోలీస్ పెట్రోలింగ్ జరుగుతుందని ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాలీ లకు, ఊరేగింపు లకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. డి జె లు పెట్టారాదనీ,బాణ సంచాలు ఎవరు కాల్చరాదన్నారు. బాణ సంచా ఎవరైనా విక్రయించిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు : సిఐ

రూరల్ సిఐ ఏసుబాబు

ప్రజాశక్తి - గుడివాడ : మంగళవారం ఎలక్షన్ కౌంటింగ్ లెక్కింపు జరగుతున్న దృష్ట్యా గుడివాడ నియోజవర్గంలోని గుడివాడ తాలూకా, నందివాడ, గుడ్లవల్లేరు మండలంలోని ప్రజలు, నాయకులు అందరూ కూడా పోలీసు వారికి సహకరిచాలని రూరల్ సిఐ కె.ఏసుబాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ రేపు జరిగే కౌంటింగ్ అనంతరం ఎవరికీ కూడా విజయోత్సవ ర్యాలీలుకు అనుమతి లేదన్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం లా అండ్ ఆర్డర్ అదుపు చేయు క్రమంలో అవసరమైతే లాఠీఛార్జ్, మితిమీరితే ఫైర్ కూడా ఓపెన్ చేయబడుతుందన్నారు. దయచేసి ప్రజలందరూ ఈ విషయాలు దష్టిలో పెట్టుకుని పోలీసువారికి సహకరించి శాంతిభద్రతలను కాపాడాలన్నారు.

త్వరలో అందుబాటులోకి పరిపాలనా భవనం

- కెయు ఉపకులపతి ఆచార్య జి. జ్ఞానమణి

భవనాలు పరిశీలిస్తున్న ఉపకులపతి జ్ఞానమణి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : జూన్ మాసాంతానికి నూతన పరిపాలనా భవనం అందు బాటులోకి తీసుకు వస్తామని కష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి వెల్లడించారు. స్థానిక డా ఎమ్మార్ ఏఆర్ పిజి స్టడీస్‌లో జరుగుతున్న నూతన పరిపాలనా భవనం నిర్మాణ పనులను ఏపిఈడబ్లుఐడిసి అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది కోట్ల రూపాయల వ్యయం తో చేపట్టిన నిర్మాణ పనుల లో ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన పనుల ను జూన్ మాసాంతం నాటికి పూర్తి చేసి అందుబాటు లోకి తీసుకు వస్తామని చెప్పారు. ఆ మేరకు ఏపిఈడబ్లుఐడిసి అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. కష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో జరుగుతున్న కాంపౌండ్ వాల్, ఆర్చ్ గేట్, క్యాంటీన్, బాలికల వసతి గహం నిర్మాణ పనుల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏ పి ఈ దబ్లు ఈ డి సి ఎండి దివాన్ రెడ్డి, సిఇ నరసింహ మూర్తి, ఈఈ రాయన్న, పీజి స్టడీస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన లావణ్య లత, నిర్మాణ సంస్థ సూక్షేత్ర ఇన్ఫ్రా ప్రొజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.48 కోట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం మహామండపం ఆరో అంతస్తులో సోమవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. 18 రోజులకు సంబంధించి హుండీలను లెక్కించగా నగదు రూ.3,48,33,515లు, బంగారం : 535 గ్రాములు, వెండి : 7 కేజీల 840 గ్రాములు యాత్రికులు హుండీ ద్వారా సమర్పించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు తెలిపారు. విదేశీ కరెన్సీలు యుఎస్ఏ- 601 డాలర్లు, ఇంగ్లాండ్ - 5 పౌండ్లు, ఓమన్ - 100 బైంసాలు, కెనడా - 10 డాలర్లు, యుఏఇ - 525 దిర్హామ్స్, కువైట్ - 1 దినార్, సౌదీ - 132 రియాల్స్, ఖతార్- 9 రియాల్స్, యూరో - 10 యూరోలు, సింగపూర్ - 2 డాలర్లు భక్తులు సమర్పించారు. ఆన్‌లైన్ ఈ -హుండీ ద్వారా రూ.1,31,114లు యాత్రికులు చెల్లించుకున్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, భవానీ సేవా దారులు హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దాతకు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, ఇంద్రకీలాద్రి, దుర్గమ్మ ఆలయంలో ప్రతిరోజూ జరుగు నిత్యాన్నదానం పథకానికి అరండల్‌పేట, గుంటూరుకు చెందిన పప్పుల వెంకటేశ్వర్ రెడ్డి రూ.1,00,116లను దేవస్థానంలో జరిగే అన్నదానం నిమిత్తం పప్పుల శ్రీధర్ రెడ్డి పేరున సోమవారం ఆలయ అధికారులను విరాళం అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించగా, వేదపండితులు వేదాశీర్వచనం చేసి ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

బాలుడికి 'దీవెన' సాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న మూడు సంవత్సరాల బాలుడు రాయబారపు శరత్‌కు దీవెన ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించి వితరణ చాటుకున్నారు. తిరువూరుకు చెందిన బిక్షాలరావు రోజువారి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరి కుమారుడు కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స నిమిత్తం చాలా ఖర్చు చేశాడు. ప్రస్తుతం చిన్నారి బాలుడికి కీమోథెరపీ ట్రీట్‌మెంట్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో తండ్రి బిక్షాలరావు కుమారిడి చికిత్స నిమిత్తం సహాయం కోసం దీవెన ఫౌండేషన్‌ను ఆశ్రయించాడు. స్పందించిన దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారి తరపున రూ.10 వేలు ఆర్థిక సహాయం బాబు హాస్పిటల్ ఖర్చులు నిమిత్తం సోమవారం గ్రూప్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ జాజుల నాగరాజు, శ్రీధర్‌లు ఆర్థిక సాయం అందజేశారు.

సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రోడ్డుపైనే మురుగునీరు

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 43వ డివిజన్ ఊర్మిళానగర్ ప్రధాన రహదారిలో ఓ వ్యాన్‌హోల్ నుండి దుర్వాసనతో కూడిన మురుగునీరు పొంగి బయటకు పారుతున్నాయి. చర్చి సెంటర్ నుండి ఊర్మిళానగర్‌లోకి వెళ్లేందుకు ఇటీవలే కోట్ల రూపాయలతో పెద్ద రోడ్డు కూడా నిర్మించారు. రోడ్డు నిర్మాణ సమయంలో మ్యాన్‌హోల్స్ కూడా నిర్మించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవటంతో సంబంధిత వ్యాన్‌హోల్ నుండి మురుగు నీరు బయటకు వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నామని అంటున్నారు. ప్రతి నిత్యం ఆ రోడ్డు చాలా ట్రాఫిక్ మయంగా ఉంటుంది. అలాంటి రోడ్డులో గత కొద్ది రోజులుగా మ్యాన్‌హోల్ పొంగి నీరు బయటకు రావటంతో అటుగా ప్రయాణించే వాహన దారులు, స్థానికులు, పాదచారులు దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. అయితే ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు చెబుతున్నారు. విఎంసి అధికారులు తక్షణమే పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మ్యాన్ హోల్ నుండి బయటకు వస్తున్న మురుగు నీరు

కౌంటింగ్ విజయవంతం చేయాలి

పూర్తి ఫలితాలు వచ్చేదాకా అశ్రద్ధ వద్దు అని నందిగామ టిడిపి అభ్యర్థి తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 144 సెక్షన్ అమల్లో ఉందని అధికారులకు, పోలీస్ యంత్రాంగానికి సహకరిద్దామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు మూడు నెలలు మండుటెండను సైతం లెక్క చేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించి పోలింగ్ ప్రక్రియను విజయంతం చేసే దిశగా కష్టపడి పనిచేశారని తెలిపారు. జూన్ 4న కౌంటింగ్ రోజు కూటమి కౌటింగ్ ఏజెంట్లు, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అన్నదానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీలోని మార్కెట్ సెంటర్‌లో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో సోమవారం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మైలవరం టిడిపి అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహాకూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. కొండవల్లి మున్సిపాలిటీలో హనుమాన్ జయంతి సందర్భంగా కొండపల్లి మార్కెట్ సెంటర్‌లో గల ఆంజనేయస్వామి దేవస్థానంలో మైలవరం నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని సర్నాల తిరుపతిరావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం తిరుపతిరావును ఆంజనేయ దేవస్థానం కమిటీ వారు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు నాగులూరి దుర్గాప్రసాద్ కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్స్ గుంజ శ్రీనివాస్, బాడిశ నాగరాజు కుమారి, వి.సుబ్బారావు పాల్గొన్నారు.

అన్నదానంలో వసంత

అన్నదానంలో తిరుపతిరావు

వేసవి శిక్షణా శిబిరాల్లో పలు కార్యక్రమాలు

ప్రజాశక్తి - గంపలగూడెం : విద్యార్థి దశలో ఆరోగ్యానికి బలమైన ఆహారం తీసుకోవాలని పలు ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి సంకర నాగేశ్వర ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పాలు గుడ్డుతో పాటు, మంచి వాతావరణం గాలి నీరు అవసరమన్నారు. మీ ఇళ్ల వద్ద మంచి మొక్కలు నాటి స్వచ్ఛమైన గాలి పీల్చాలని తెలిపారు. ఉదయాన్నే లేచి, కాలకృత్యాలకు అనంతరం ఆరోగ్యానికి అవసరమైన యోగ తదితర అంశాలను బోధించారు. ఉపాధ్యాయులు అనుబోతు నాగేంద్ర, వై.క్రాంతి కుమార్ సూచించారు.

విద్యార్థులకు నీతి కథలు

మైలవరం : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు మర్యాద రామన్న నీతి కథలు చదివించి చెప్పించారు. అనంతరం జడ్‌పిహెచ్ఎస్ స్కూల్ పొందుగల గణిత ఉపాధ్యాయులు పి.ప్రసాద్ మాట్లాడుతూ జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విశ్వం వల్ల మానవ ప్రయోజనాల గురించి వివరించారు.

విజయవాడ : చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్యనారాయణపురంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా మొదటిగా విద్యార్థులచే నీతి కథలు చదివించి చెప్పించారు. రిసోర్స్ పర్సన్ ఆర్.శ్రీనివాసులు జనరల్ నాలెడ్జ్, క్విజ్‌లో శిక్షణ ఇచ్చారు. అనంతరం రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి 'ఎగ్జామ్స్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించడం ఎలా' అను అంశం గురించి క్లుప్తంగా వివరించారు. ఏకాగ్రతతో చదివితే పరీక్షల్లో విజయం సాధించడం చాలా సులభం అన్నారు. 50 నుండి 60 నిమిషాలు చదివిన తరువాత విశ్రాంతి తీసుకోవాలన్నారు. విద్యార్థులకు 'నీకు నచ్చిన గీతం' అను అంశంపై 'పాటలు పోటీలు' నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగి ఆర్.శ్రీ నివాసులు, కె.కనక దుర్గా దేవి, గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ ఈ పోటీకి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ సంగీతం గురించి మాట్లాడుతూ ఒత్తిడితో నిండిన మనసుకు రెమిడియల్ మెలోడిని ప్రేమించే శక్తి సంగీతానికి ఉందని అన్నారు. విజేతలకు బహుమతులు ప్రశంశా పత్రాలు 7న అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం చెస్, క్యారమ్స్, ఆటల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్, సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

విజయవాడ : ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు గత 20 రోజులుగా తాము నేర్చుకున్న అంశాల్లో పోటీలు నిర్వహించారు. చిత్రలేఖన పోటీలు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కె.రమాదేవి మాట్లాడుతూ 5న దేశభక్తి గీతాలాపన, కథ చెప్పటం, పుస్తక సమీక్ష పోటీలు నిర్వహిస్తామని, 6న క్యారమ్ బోర్డ్, చదరంగం పోటీలు ఉంటాయని చెప్పారు. విజేతలకు 7న బహుమతులు అందజేస్తామన్నారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంచాలకుల ఆదేశానుసారం పట్టణంలోని గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. ఉపాధ్యాయుడు ప్రసాద్ బాబు విద్యార్థులకు గణితంలో త్రిభుజంలో రకాలు గురించి వివరించారు. ఉపాధ్యాయులు వినోద్‌బాబు విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆలేటి.ప్రభ, పిఈటి మణిరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

కంచికచర్ల : కంచికచర్ల శాఖా గ్రంథాలయం సోమవారం సమ్మర్‌క్యాంప్‌లో డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు విద్యార్థులకు డ్రాయింగ్‌పై శిక్షణ ఇచ్చారు. క్రాఫ్ట్ మాస్టర్ కనకారావు రోడ్ భద్రత గురించి వాహనం నడిపేటప్పుడు, నడిచేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కలర్ కాంబినేషన్ గురించి, రోడ్ సిగ్నల్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయుష్ యోగా మాస్టర్ మేడూరి మాణిక్యాలరావు, విద్యార్థులకు యోగాసనాలు పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను ఎంపిక చేశారు. డాన్స్ మాస్టర్ బిట్ర రాహుల్ కుమార్ విద్యార్థులకు డాన్స్ నేర్పించారు. అనంతరం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. చెస్, షటిల్, టెన్నికాయిట్ ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 2 గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు.

గంపలగూడెం గ్రంథాలయంలో పాల్గొన్న విద్యార్థులు

మైలవరం గ్రంథాలయంలో పాల్గొన్న విద్యార్థులు

కంచికచర్ల గ్రంథాలయంలో పాల్గొన్న విద్యార్థులు

ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం కృష్ణా యూనివర్సిటీలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం రోజున ఓట్ల లెక్కింపు జరుగనున్న నేపథ్యంలో విభాగాల వారీగా ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. పరిశీలనలో ముందుగా ఆయన ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలోకి ప్రవేశించే సిబ్బంది, పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్ల మొబైల్ ఫోన్లను భద్రపరిచేందుకు కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణం వద్ద నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన సెల్ ఫోన్లు భద్రపరచు కౌంటర్ ను పరిశీలించి ఎలాంటి గందరగోళం లేకుండా తగు రీతిలో కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. యూనివర్సిటీ ప్రాంగణం నుండి నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ హాళ్ళకు చేరుకునేందుకు అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందికి అర్థమయ్యే రీతిలో పెద్ద అక్షరాలతో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద ఏర్పాటు చేసిన పెయిడ్ క్యాంటీన్ ప్రదేశమును మార్చాలని, దాన్ని నిర్మాణంలో ఉన్న ఫార్మసీ భవనం దగ్గరకు మార్చాలని సూచించారు. ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి గందరగోళం లేకుండా రౌండ్ల వారీగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంతో పాటు ఏడు నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలను మీడియా వారికి చేరవేయడం, అదేవిధంగా ఫలితాలను ప్రకటించడంలో కమ్యూనికేషన్ సెంటర్ విభాగం అధికారులు జాగ్రత్త వహించాలన్నారు. తదుపరి ఆయన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అకాడమిక్ భవనంలోని పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం కౌంటింగ్ హాళ్లలోని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు అసెంబ్లీ నియోజకవర్గ పోస్టల్, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలకులు జాన్ కింగ్స్ లే ఐఏఎస్ కు జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. అనంతరం ఆయన కౌంటింగ్ సిబ్బందికి ఓట్ల లెక్కింపు కు ముందు రోజు రాత్రి రుద్రవరం గురుకుల పాఠశాల, మచిలీపట్నంలోని సాంఘిక సంక్షేమ శాఖ వారి ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గహం నెం.2లో ఏర్పాటు చేస్తున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా ఎన్నికల అధికారి వెంట జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, అదనపు ఎస్పీ ఎస్వీడీ ప్రసాద్, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ డికె బాలాజీ

వరి విత్తనాలు అందజేత

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండల పరిధి లోని రైతులకు, కౌలు రైతులకు వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాలలో సిద్ధంగా ఉన్నాయని, కనుక రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం పమిడి ముక్కల మండలం లోని మంటాడ రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు వరి విత్తనాలు అందజేశారు. రైతులు నారుమళ్లు పోయడానికి సిద్ధంగా ఉన్నారని, వారికి కావలసిన మేలైన విత్తనాలను ప్రభుత్వం అందజేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. లంకపల్లి, కష్ణాపురం, పమిడిముక్కల రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాల పంపిణీ సిద్ధంగా ఉన్నాయని, రైతులు తీసుకుని వెళ్లాలని తెలిపారు.

వరి విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ అధికారి గణేష్ రెడ్డి

జోరుగా బెట్టింగులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ళ కాదేది కవితకు అనర్హం అంటూ మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లుగా క్రికెట్ అయినా కోడిపందాలైనా ఎన్నికలైనా కాదేది బెట్టింగ్‌కు అనర్హమంటూ నేటి సమాజం లోని కొందరు రుజువు చేస్తున్నారు. ఎన్నికలు భారత దేశ ప్రజాస్వామ్యానికి పునాదిగా చెప్పుకుంటున్న తరుణంలో కొందరు స్వార్థపరులు భూస్వాములు, ధనవంతులు, కార్పొరేట్ శక్తులు ఎన్నికల వ్యవస్థను రాజకీయాలను వారికి అనుకూలంగా మలుచుకొని ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. అందులో భాగంగానే సామాజిక సేవగా ప్రారంభమైన రాజకీయాలు నేడు కలుషితమై వ్యాపార వర్గాల చేతిలో లాభసాటిగా మారి చివరకు జూద క్రీడగా మారిపోయింది. 2024 సార్వత్రిక ఎన్నికలు తీరు చూస్తే భవిష్యత్తు మరింత భయాందోళనలకు గురి చేస్తున్నట్లు కనిపిస్తున్నది. అవనగడ్డ నియోజకవర్గం లో గతంలో ఎన్నడూ లేనివిధంగా బెట్టింగ్ రాయుళ్లు చెల్లరేగిపోతున్నారు. కోడిపందాలలో పందెం రాయుళ్లు ఏ విధంగా అయితే పందాలు కాస్తారో అదే విధంగా లక్షకి రెండు లక్షలు ఇస్తామంటూ బహిరంగంగానే పందాలు కాయడం ఎన్నికల వ్యవస్థ ఎంత దిగజారిపోయిందో అద్దం పడుతుంది. శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ వెలువడిన వెంటనే పందెం రాయుళ్లు మరింత రెచ్చిపోయారు. ఎక్కడ చూసినా విపరీతంగా పందాలు వేశారు.

పట్టిసీమకు నీరు విడుదల ఎప్పుడో...?

ప్రజాశక్తి-గన్నవరం: జూన్ నెల ప్రారంభమైనప్పటికీ ప్రభుత్వం పట్టి సీమ నీరు వదలకపోవడంతో పోలవరం కాలువ మీద ఆధారపడి ఖరీఫ్లో సాగు చేసే రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడపాద డపా జల్లులు పడుతుండడంతో ఇప్పటికే మైల వరం, గన్నవరం, నూజివీడు, ఇతర నియోజక వర్గాల రైతులు ఖరీఫ్ సాగుకు ఇప్పటికే పొలాలను సిద్ధం చేసుకున్నారు. పట్టిసీమపై ఆధారపడి ఏటా జిల్లాలో 9,861 హెక్టార్లలో నారుమళ్లు వేస్తారు. జులై దగ్గరపడుతున్నా కాలువలకు నీరు రాకపోవడంతో నారుమడులు వేస్తే సాగునీటి పరిస్థితి వారిని కలవరపెడుతోంది. మరోవైపు నియోజక వర్గాల్లో ఊర చెరువులు కూడా మండుటెండలకు నీటిమట్టం తగ్గి పూర్తిగా ఖాళీ అయ్యాయి. దీంతో ఖరీఫ్ సాగుకు నారుమడులు వేస్తే పంటలు ఎండి పోయే పరిస్థితి నెలకొని వర్షాలు పడితేనే నీళ్లు అన్నట్లు పరిస్థితి తయారవుతుందని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం కాలువకు నీటి విడుదల విషయాన్ని ఇప్పటికే గన్నవరం, ఆగిరిపల్లి, నూజివీడు, మైలవరం, విజయవాడ రూరల్ మండల రైతులు స్థానిక అధికారుల దష్టికి తీసుకెళ్లారు. పట్టిసీమకు నీటి విడుదల సమస్య పరిష్కారంపై అధికా రులు, ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రకటన వెలువడకపోవడంతో అన్నదాతల్లో ఆందోళన మరింత ఎక్కువైంది. జిల్లాలో అత్యధికంగా 2.35 లక్షల హెక్టార్లలో వరి సాగు చేయాల్సి ఉండగా నీటి లభ్యత అరకొరగా ఉండడం ఇబ్బందికరంగా మారింది. గతేడాది 1.05 లక్షల హెక్టార్లలో మాత్రమే పంట సాగు చేస్తున్నారు. పట్టిసీమ నీరు ఆలస్యమైతే ఈఏడాది ఖరీఫ్ లో వరి సాగు శాతం మరింత తక్కువయ్యే ప్రమా దం ఉంది. దీనిని దష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సత్వరమే పట్టిసీమకు నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకో వాలని రైతు సంఘం నాయకులు, కర్షకులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండల రైతు సంఘ సమావేశం మలిశెట్టి ప్రసాద్ అధ్యక్షతన, గుండా బత్తల ఆంజనే యులు భవనంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు రైతాంగ సమస్యలపై, రైతు సంఘం తక్షణ కర్తవ్యాలు గురించి మాట్లాడారు. అలాగే ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మీచౌంగ్ తుఫాన్ ఇన్పుట్ సబ్సిడీ రాని రైతులకు వెంటనే వారి ఖాతాలో జమ చేయాలని, ప్రభుత్వం ఆర్.బి.కె ల ద్వారా నాణ్యమైన వరి విత్తనాలు 50 శాతం సబ్సిడీపై రైతులకు, కౌలు రైతులకు ఇవ్వాలని, ఆర్బికెల ద్వారా కాంప్లెక్స్ ఎరువులు తోపాటు యూరియా, పొటాషియం నాణ్యమైన ఎరువులు కూడా రైతులకు, కౌలు రైతులకు అందించాలని, గత కొన్ని సంవత్సరాల నుండి డ్రైనేజీ తీవ్రసమస్యగ ఇబ్బందికరంగా ఉన్నది, కాబట్టి ఈ సంవత్సరం ప్రభుత్వం , అధికారులువెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తీర్మానాలు చేసారు .ఈ సమావేశంలో బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, కత్తివెన్ను మండలం రైతు సంఘం అధ్యక్షుడు పట్టపు ఏసుబాబు, దూసనపూడి పరంధామయ్య, దూసనపూడి రామా రావు, జెన్యావుల కన్నారావు ,గౌరిశెట్టి నారాయణరావు, గొట్టిపాటి గంగాధర్, గౌరిశెట్టి శ్యాం బాబు, గౌరిశెట్టి లక్ష్మీనారాయణ, సుంకర పాములు ,గౌరిశెట్టి వెంకటనారాయణ, వంగల రాజా పాల్గొన్నారు.

వెంకట్రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బుద్ధ ప్రసాద్, తదితరులు

వెంకట్రావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : టిడిపి అవనిగడ్డ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిరిశం వెంకట్రావు జన్మదిన వేడుకలు అవనిగడ్డలోని బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద సోమవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బుద్ధ ప్రసాద్ ఇంటి వద్ద వెంకటరావు పుట్టినరోజు కేకును కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి అభ్యర్థుల విజయానికి కషిచేసిన వెంకట్రావును బుద్ధ ప్రసాద్ ఘనంగా సత్కరించారు. యువ నాయకులు మండలి వెంకట్ రామ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వ రరావు, మోపిదేవి జడ్పిటిసి మేడబలివి మల్లికార్జునరావు, కర్ర సుధాకర్ పాల్గొన్నారు.

వరి విత్తనాలు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి-గన్నవరం : వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు అవసరమైన వరి పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఏపీ రైతు సంఘం గన్నవరం మండల కార్యదర్శి సూరగని సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గన్నవరంలోని సంఘ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం కొలుసు శ్రీమన్నారాయణ అధ్యక్షతన జరిగింది. సాంబశివరావు మాట్లాడుతూ సాగునీరు విడుదల చేయడానికి ముందుగానే కాలవల్లో తూటు కాడ తొలగించడంతోపాటు పూడికలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వరి, పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పచ్చి రొట్ట పైరు విత్తనాలను కూడా రైతులకు పూర్తి సబ్సిడీపై ఇవ్వాలన్నారు. రైతు భరోసా కేంద్రాలకు సకాలంలో విత్తనాలు వచ్చేలా చూడాలన్నారు. జాస్తి శ్రీనివాసరావు, అవుటుపల్లి సాంబయ్య పాల్గొన్నారు.

ఏజెంట్లు, అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు మూడు నెలలు మండుటెండను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించి పోలింగ్ ప్రక్రియను విజయంతం చేసే దిశగా కష్టపడి పనిచేశారని జగ్గయ్యపేట నియోజకవర్గం ఎన్డీయే కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పేర్కొన్నారు. సోమవారం తాతయ్య నివాసంలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ (ఎంసీసీ) 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ చేసుకొని అధికారులకు, పోలీస్ యంత్రాంగానికి సహకరించాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని కొత్త కళ్యాణమండపంలో నియోజకవర్గ వైసిపి కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడారు.

కౌంటింగ్‌కు సహకరించాలి

ప్రజాశక్తి - నందిగామ : కౌంటింగ్ సమయంలో ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరిం చాలని నందిగామ ఎంఎల్ఏ అభ్యర్థి మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకొని 144 సెక్షన్ అమలులో ఉన్నందున శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి

ప్రజాశక్తి - వత్సవాయి : పిడుగుపాటుకు గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మంగోల్లు గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామానికి చెందిన ఎన్.వెంకటేశ్వరావు రోజువారీగా మేత కోసం ఆదివారం పొలం వెళ్లాయి. ఆదివారం సాయంత్రం వర్షం పడటంతో గేదలు కొంచెం ఆలస్యంగా ఇంటికి బయలుదేరాయి దీంతో సాయంత్రం వర్షాలు పడటంతో పిడుగుపాటు గురై మృతి చెందింది. సుమారు 80,000 విలువ కలిగిందని తెలిపారు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందజేయాలని కోరుతున్నారు.

కౌంటింగ్‌పై సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.రవీంద్రరావు సోమవారం సిబ్బందికి నందిగామలో శిక్షణ ఇచ్చారు. నోవా ఇంజనీరింగ్ కాలేజీ, జూపూడిలో జరిగే కౌంటింగ్ గురించి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 83-నందిగామ ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ అబ్జర్వర్ గౌరీష్, ఎస్.కుర్తికర్ వారు ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్ చేత సిబ్బందికి వారి విధివిధానాలు వివరించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని కౌంటింగ్ సెంటర్‌కు సకాలంలో చేరుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, ఇవిఎం మెషిన్ కౌంటింగ్ గురించి వివరించారు. కౌంటింగ్ సూపర్వైసర్స్, కౌంటింగ్ ఏజెంట్స్, మైక్రో అబ్జర్వర్స్, 83-నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం ఇఆర్‌ఒలు సిబ్బంది పాల్గొన్నారు.

జయరాజుకు నివాళి

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో ఆదివారం మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ఎస్‌సి సెల్ సెల్ ప్రధాన కార్యదర్శి వేముల జయరాజు (76) మృతదేహాన్ని నందిగామ వైసిపి అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు సోమవారం సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాల్లో జయరాజు చురుకైన భూమిక పోషించారు. జయరాజు భౌతికకాయాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాస్, నందిగామ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మంద వజ్రయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఒక సమర్థవంతమైన నాయకుడిని కాంగ్రెస్ పార్టీ కోల్పోవటం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వేల్పుల శివకృష్ణ, కొండపల్లి మున్సిపాలిటీ పార్టీ ఉపాధ్యక్షులు చెరుకు ఆనందరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతురాజు తమస్పాల్, కంచికచర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయుడు, జయరాజ్ కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న దృశ్యం

WANTED

పాత కృష్ణా జిల్లాలో
ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు
అనుభవం కలిగిన డిప్లొమా
EEE మరియు ITI
ఎలక్ట్రీషియన్ అభ్యర్థులు కావలెను.
ఆసక్తి గల వారు సంప్రదించండి.
80966 50666
72076 65066

నోటీసు

మహారాజశ్రీ ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.17/2022

Between: పూజారి శ్రీలత ...వాది
And: గంట్రెడ్డి నాగమ్మ వగైరాలు ...ప్రతివాదులు
To,
ప్రతివాది నంబరు:3 (D-3): గంట్రెడ్డి నీలవేణి, W/o లేటు శ్రీనివాస రావు, 35 సంవత్సరాలు, R/o: డోరు నంబరు:77-48-3, శాంతినగర్, ప్రకాష్ నగర్, అజిత్ నగర్, విజయవాడ అర్బన్, కృష్ణ జిల్లా, పిన్ కోడ్:520015.
ప్రతివాది నంబరు:4 (D-4): గంట్రెడ్డి లక్ష్మి, W/o లేటు మల్లేశ్వర రావు, 41 సంవత్సరాలు, ---rest do---

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల దావాలో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **మీరు తేదీ 26-06-2024 న ఉదయం: గం॥ 10-30 ని॥ లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియ జేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి //

చౌదరి లక్ష్మణరావు
వాది తరపు న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 9640780728.

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD

O.S. No. 234 of 2022

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep. by its Sr. Manager(Law)&Authorized Officer, ...Plaintiff
And
Sri.Swaminathan Sundaresan, **...Defendant**
To
Sri.Swaminathan Sundaresan, S/o. B.Sundaresan, Aged about 54 years, Occ: Pvt. Employee, R/o.H.No.33-5-10, Post Office Street, Sitaramapuram, Vijayawada, A.P-520002.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,91,641-83ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 12-06-2024. In case of your failure to attend before the Court on 12-06-2024 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

I.A. No. 212/2021 in O.S. No. 07/2013

బిట్వీన్:
రాంపల్లి ప్రభాకర రాయ ***...పిటీషనర్/ వాది***
అండ్
1. రాంపల్లి బుచ్చి రామశర్మ
2. రాంపల్లి రామ కృష్ణరాయ
3. రాంపల్లి సుధాకర రాయ
4. పారనంది శోభాదేవి
5. చేబోలు వెంకట రామలక్ష్మి

...రెస్పాండెంట్స్/ ప్రతివాదులు

ప్రపోజ్డ్ పార్టీస్:
1. రాంపల్లి శ్రీరమణ కుమారి
2. రాంపల్లి సుబ్రహ్మణ్య శ్రీమంజునాధ్
3. రాంపల్లి లక్ష్మి శ్యామల

...ప్రపోజ్డ్ పార్టీలు/ రెస్పాండెంట్స్

నోటీసు టు:
1. శ్రీమతి రాంపల్లి శ్రీ రమణ కుమారి, W/o. late సుధాకర రాయ, 51 సం॥రం॥లు, హిందూ, స్త్రీ, గృహిణి, రత్నా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 503, శివాలయం రోడ్, ఉయ్యూరు - 521165, కృష్ణా జిల్లా.
3. రాంపల్లి లక్ష్మి శ్యామల, D/o. late సుధాకర రాయ, 25 సం॥రం॥లు, హిందూ, స్త్రీ, స్టూడెంట్, రత్నా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నెం. 503, శివాలయం రోడ్, ఉయ్యూరు - 521165, కృష్ణా జిల్లా.

పైన ఉదహరించిన దావా విచారణలో ఉండగా 3వ ప్రతివాది అయిన రాంపల్లి సుధాకర రాయ ది. 12-05-2020 సం॥రం తేదీన మరణించిన పిమ్మట 1, 2, 3 ప్రపోజ్డ్ పార్టీలను వారసులుగా చనిపోయిన వారిస్తానే చేర్చుటకు పైన ఉదహరించిన పిటీషన్ దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టు వారు మీకు చాలా పర్యాయములు నోటీసులు కోర్టు ద్వారాను, మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారా పంపించి యుండగ 2వ ప్రపోజ్డు పార్టీ వారికి అమలు కాబడి కోర్టుకు హాజరు అవ్వలేదు. 1, 3 ప్రపోజ్డు పార్టీ వారికి కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపియున్నప్పటికి అవి అమలు కానందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు ప్రకటన జారీ చేయుటకు ఆదేశించియున్నారు. కావున 1, 3 ప్రపోజ్డు పార్టీలుకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా **ది. 19-06-2024వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పైన ఉదహరించిన కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై ఈ దావా విషయమై మీ సమాధానములు తెలియజేయవలెను. లేనియెడల మీకు పరోక్షమున సదరు దావా విషయములు తీర్మానించబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ
అడ్వకేట్, 3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:03-5-24 ఫోన్: 08814-274628

NAME CHANGE

I, **MALLIKA NOORJAHAN BEGUM (M.N.BEGUM)** alias **PYARIJAN** (new name), previously called **PYARIJAN** w/o Late Shaik Baba, D.No: 15/546-MIG-2-215, New Housing Board Colony, Machili patnam, A.P.

I have changed my name to **MALLIKA NOORJAHAN BEGUM (M.N.BEGUM)** alias **PYARIJAN** for all purposes.

PUBLIC NOTICE

The General Public are hereby informed that our client Boinaboina Phaneendra, S/o. Naga Raju (late), aged 30 years, R/o. D.No.13/433, Patimeedha, Gudivada, Krishna District, is interested in purchasing the Hotel business by name "Lakshmi Srinivasa Enterprises" which runs under a Franchise name and style "NAIDU GARI KUNDA BIRYANI" at Eluru Road, Gudivada, Krishna District which is described in the below given schedule from its owner said to be Movva Pranay, S/o. Srinivasa Rao, D.No.3-89, Padamati Narsapuram, Julurpad, Khammam, Telangana–507166.

Our client is now preparing to proceed to take further steps for taking possession of the schedule of the property and its appended movables to take over and run the said business by paying valuable consideration.

So any person/persons/entity having any claims/objections to the proposed purchase by our client and having any right, title, interest and trademark in running said business by our client in the schedule property, may lodge their objections, claims or any charge on it, with supporting and documentary evidence within One week of this publication of notice with the undersigned.

Failing which, it will be presumed that here is no claim/objections over the said property and nobody has any right, title, interest, charge and trademark on the said business to run at Gudivada, which is to be purchased by our client and our client can purchase the same and will proceed further, and if any claim made thereafter will not bind my client.

SCHEDULE OF PROPERTY

Situated within the SRO Gudivada in 10 th ward at Valivartipadu Village in R.S.No.517/2, D.No.10/52-1, in the 3 rd floor of the building, the inventory available i.e., the furniture, Kitchen equipment & Utensils and other attachments of "Lakshmi Srinivasa Enterprises" under the name and style "NAIDU GARI KUNDA BIRYANI" at Gudivada, Krishna District.
East: 54.73 sft South: 78.23 sft
West: 54.73 sft North: 78.23 sft
Place: Gudivada
Date: 04-06-2024

Alluri Hemanth Kumar
Advocate, Gudivada-
Cell No.9059808639

మహారాజశ్రీ గుడివాడ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టులో

E.P. No. 16/2023 in OS No. 309/2018

Between :
Polimetla Kishore .... DHR
and
Shaik Subhani S/o Shaik Abdulla Saheb, D.No. 19/72-9-4, ramalayam Street, Karmika Nagar, Gudivada .... JDR

వేలం నోటీసు

పై నెంబరు ఇ.పి. పిటీషన్‌లో పైన పేర్కొన్న కోర్టువారి ఎదుట ఈ నెంబర్‌లో జెడిఆర్ మీకు హక్కు భుక్తంలో వున్న ఈ దిగువ పిటీషన్ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని ది. 18-6-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం డిహెచ్‌ఆర్ డిక్రీ బాకీ రాబట్టుకునే నిమిత్తం వేల వేయబడును. కావున ఆసక్తివున్నవారు వేలంపాటలో పాల్గొని, పాట పాడుకొనవలసినదిగా కోరడమైనది. ది. 1-1-2007 నుండి 1-10-2022 వరకు సబ్ రిజిస్ట్రార్ వారు గుడివాడ నందు ఇ.సి. తీసుకొనక ఎటువంటి అన్యాక్రాంతములు లేనందు, సదరు వేలంను ఫ్రీ గా వేయబడును.

షెడ్యూలు

కృష్ణాజిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వారి యిలాకా, గుడివాడ మండలం, గుడివాడ టౌన్ పరిధిలోని పెద ఎరుకపాడులోని ఆర్.ఎస్.నెం. 2, డోర్ నెం. 19/88లోని 97.95 చ॥ గజములు లేక 81.89 చ.మీ. స్థలం మరియు అందలి ఇంటికి హద్దులు.
East : Compounding wall of Gudimetla Khasim Meera and there house ..49'.3"
South : Property of Thota Kanthamma - 16'.7 1/2"
West : Property of Shaik Karimulla - 49'.3"
North : Municipal Bazaar -19'.3"
DHR Value : Rs.10,00,000/-
Amin Value : Rs.15,00,000/-

By court Order
Sri. Y.Ankineedu Prasad,
Advocate, Gudivada,
CellNo : 9963103456.

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD

O.S. No. 1213 of 2023

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr. Manager(Law)&Authorized Officer, **...Plaintiff**
And
Smt.A.Sridevi, **...Defendant**
To
Smt.A.Sridevi, D/o.Bapineedu Prasad.B, Aged about 53 Years, Occ: Business, R/o.D.No.13-140, Patimeeda, Gudivada, Krishna Dist, A.P-521301.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.4,15,151-70ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 12-06-2024. In case of your failure to attend before the Court on 12-06-2024 at 10-30 A.M ither in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T.Bhagya Raju & Associate
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts,
Opp: R.S.Brothers, Chandanagar,
Gangaram Village, HYDERABAD-50.

మహారాజశ్రీ కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

F.D.P. No. 23/2023
O.S. No. 86/2020

Between:
వనం రాజేశ్వరి ***-పిటీషనరు/వాది***
మరియు
పువ్వల అనిత, వగైరాలు
-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు
To:
R-2: అబ్దుల్ నసీరా బేగం, W/o. అబ్దుల్ సత్తార్, డో.నెం. 9-1-1/9, అస్సాం నగర్, లంగర్ హౌస్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా.
R-3: మహమ్మద్ అబ్దుల్ నజీర్, S/o. మహమ్మద్ అబ్దుల్ అజీజ్, డో.నెం. 42-39-15/ఎ, అజీత్‌సింగ్ నగర్, ఇందిరానాయక్ నగర్, విజయవాడ.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషనులో 2వ మరియు 3వ రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినన్ను పుచ్చుకొనకుండా కాలయాపన చేయుచున్నందున సదరు రెస్పాండెంట్లు అయిన మీకు **ది. 02-7-2024 సం॥ తేదీన వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలియపర్చుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

బి.రామలింగశర్మ, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9948269699

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

నిబంధనలకు విరుద్ధంగా ట్రైర్ బండ్లపై ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-చల్లపల్లి : ఇసుక రవాణాపై ఏవిధమైన అధికారిక అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా నది తీర ప్రాంతాల నుండి సైతం ట్రైర్‌బండ్లతో సుదూర ప్రాంతాలకు రవాణా చేస్తున్నప్పటికీ స్థానిక అధికారులకు ఇసుక అక్రమ రవాణా కానరాక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలలో ఇసుక తవ్వ కాల నియంత్రణకు మైనింగ్, రెవిన్యూ, పోలీస్ సంబంధిత శాఖలతో కమిటీ ఏర్పాటు జరగాలని దేశ సర్వోన్నత న్యాయ స్థానం ఉత్తర్వులు ఉన్నప్పటికీ అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని శ్రీ కాకుళం,పాప వినాశానం, వెలువోలు, సిఆర్‌జెడ్ పరిధిలోని నిమ్మగడ్డ నడకుదురు నదీ తీర ప్రాంతాలనుండి అత్యధిక సంఖ్యలో ట్రైర్ బండ్ల పై ఇసుక సుదూర ప్రాంతంలోని కొడాలి గ్రామ సమీపంలో పరిశ్రమకు తరలి వెళ్లి పోవడం బహిరంగ రవాణా జరుగుతున్నా పట్టించుకున్న అధికారులు లేరనే అభిప్రాయాలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన అధికారులకు ఈ అక్రమ రవాణా కాసుల పంట గా మారింది. రాత్రి,పగలు తేడా లేకుండా ఇసుకను లోడ చేసుకొని అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నా అధికారయంత్రాంగంలో చలనం లేక పోవటం గమనార్హం. ఇదే నియోజకవర్గ పరిధిలోని నడకుదురు నిమ్మగడ్డ నదీ తీర ప్రాంతంలో అక్రమ త్రవ్వ కాలపై స్పందిస్తూ తవ్వ కాల నిలుపుదల కు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏపీ హై కోర్టు ఆదేశించి నప్పటికీ ఆ ఉత్తర్వులను అమలు పరచడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నవి. ఏవిధమైన ప్రభుత్వ పర అనుమతులు లేకుండా అక్రమ రవాణా కు పాల్పడుతున్న వారిపై జిల్లా స్థాయి ఉన్న తాధికారులు తక్షణమే చర్యలు తీసుకుని న్యాయ స్థానం ఉత్తర్వులుఅమలు చేసి పర్యావరణ రక్షణ తో తోడ్పడాలని స్థానికు లు కోరుతున్నారు

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి : మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన కూటమి కౌంటింగ్ ఏజెంట్లు నిశిత పరిశీలనతో వ్యవహరించాలని టిడిపి, బిజెపి బలపరిచిన జనసేన పార్టీ అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బుద్ధ ప్రసాద్ సూచించారు. సోమవారం అవనిగడ్డలో బుద్ధ ప్రసాదింటి వద్ద కూటమి కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో సంయమనంతో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపు మొదలుకొని చివరి రౌండు వరకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్య క్రమంలో టిడిపి జనసేన బిజెపి పార్టీల ఏజెంట్లు పాల్గొన్నారు.

ఫాదర్ జాన్‌హరిష్‌కు సత్కారం

ప్రజాశక్తి - గుడివాడ : పవిత్ర ఆత్మతో ప్రేరణ పొంది ప్రపంచమంతటా తిరిగి దైవ వాక్కును అందించటం గురువుల బాధ్యత అని ఫాదర్ గుజ్జుల మైఖేల్ అన్నారు. సోమవారం స్థానిక ఏలూరు రోడ్‌లోని మౌంట్ కార్మల్ (ఆర్‌సిఎం) చర్చిలో ఏడాది కాలంగా సహాయ గురువుగా పనిచేసిన జాన్‌హరిష్‌కు చర్చి కౌన్సిల్ సభ్యులు, యూత్, మరియదళ, విన్సెంట్ ది పాల్ సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విచారణ గురువు గుజ్జుల మైఖేల్ మాట్లాడుతూ బ్రదర్‌గా 14సంవత్సరాలు దైవవాక్కుకై తర్ఫీదు పొంది మరో 5సంవత్సరాలు వివిధ ప్రాంతాలలోని చర్చిలలో సహాయ గురువులుగా బాధ్యతలు చేపట్టడం దేవుని వరమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియం జోషి, సభ్యులు రెబ్బా బాలరాజు, వీరబత్తిన జీవరత్నం, ఇంటి స్వామిదాసు, ఉపదేశికులు దార సబాస్టిన్, తోట క్రీస్తురాజు, ఆంతోని, భాస్కర్, బాలస్వామి పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-గుంటూరు : ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓట్ల లెక్కింపు చేపట్టాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఇంటర్నేషనల్ బిజినెస్ స్కూల్ మీటింగ్ హాల్లో నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సూపర్వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు మాస్టర్ ట్రైనర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ కమిషనర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. గుంటూరు తూర్పు నియోజ`వర్గానికి సంబందించి 14 టేబుల్స్ ఈవిఎంలకు, 4 టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్కి, 1 టేబుల్ ఈటిపిబిఎస్ లెక్కింపునకు ఏర్పాటు చేశామని, మొత్తం 19 రౌండ్లలో లెక్కింపు పూర్తి అవుతుందన్నారు. ఇప్పటికే పోటీ చేసిన అభ్యర్ధులకు, ఏజంట్లకు గుర్తింపు కార్డులు అందించామన్నారు.

బాపయ్యచౌదరి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు : ఉమ్మడి గుంటూరు జిల్లా, పెదనందిపాడు జన్మించి ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) అధ్యక్షునిగా భాషే రమ్యం సేవే గమ్యం నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాలలో విద్యార్థులు, మహిళలు, వృద్ధుల కోసం ఇతోధికంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన నూతి బాపయ్య చౌదరి (బాపు) కృషి మరువలేనిది అని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. నాట్స్ అధ్యక్షులుగా నూతి బాపయ్య చౌదరి రెండేళ్ల కాలం ముగియటంతో పదవీ విరమణ సందర్భంగా స్థానిక అరండల్‌పేట గీతరీజెన్సీ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ నాట్స్ అధ్యక్షునిగా బాపయ్యచౌదరి తన సేవల ద్వారా భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యావేత్త డాక్టర్ కన్నా మాస్టర్ మాట్లాడుతూ మాతృ భూమి రుణం తీర్చుకునే అవకాశం ఇచ్చిన బాపయ్య చౌదరి తల్లిదండ్రుల కీర్తి జిల్లా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, అవగాహన కార్యదర్శి కె.శివరామిరెడ్డి, ముద్దన నాగరాజ కుమారి, పారిశ్రామికవేత్తలు రాఘవయ్య, శేషగిరిరావు, జి.ఎస్.ఆర్, కాకుమాను నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంచి పుస్తకానికి మించిన స్నేహితుడు లేడు

ఎపి గ్రంథాలయ సంఘం కార్యదర్శి డాక్టర్ రావి శారద

ప్రజాశక్తి-తాడేపల్లి :మనిషికి పుస్తకానికి మించిన స్నేహితుడు ఉండదని రాష్ట్ర గ్రంథాలయ సంఘం కార్యదర్శి డాక్టర్ రావి శారద అన్నారు. తాడేపల్లి బైపాస్-రోడ్డు అమరావతి ఐకాన్‌లో 25 రోజుల పాటు జరిగిన బాలల వేసవి శిక్షణా శిబిరం ముగింపు సభ మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి అధ్యక్షతన ఆదివారం రాత్రి అమరావతి ఐకాన్‌లో జరిగింది. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శారద మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ఇంట్లో మన నుంచే ప్రారంభించాలని అన్నారు. పెద్ద వారు చేసే పనినే పిల్లలు అనుకరిస్తారని, పుస్తక పఠనం ఆ విధంగా పెద్దల నుంచి పిల్లలకు వారసత్వంగా రావాలని నొక్కి చెప్పారు. పుస్తకానికి మరణం ఉండదని పేర్కొన్నారు. ఎన్ని ఛానల్స్ వచ్చినా, మీడియా విస్తారంగా పెరిగినా పుస్తకానికి ఎటువంటి భంగం ఉండదని చెప్పారు. పుస్తకాలు ఎక్కువగా చదువుకునే అలవాటు ఉన్న వారికి మతిమరుపు కూడా రాదని స్పష్టం చేశారు. అలాగే యోగా, మంచి మ్యూజిక్ వినడం ద్వారా డిప్రెషన్ నుంచి బయటపడవచ్చని చెప్పారు. అమెరికా అబ్రహం లింకన్ కూడా చదువు ప్రాముఖ్యతను, పుస్తకం ఆవశ్యకతను వివరించిన సంగతిని గుర్తు చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మాగాంధీ, నెహ్రూ తదితర అందరూ పుస్తకాలు బాగా చదివిన వారేనని చెప్పారు. వార్తా పత్రికలు చదవడం ద్వారా జరిగిన సంఘటన మూలాల్లోకి వెళ్లిన భావన కలుగుతుందన్నారు. పిల్లలు రోజు 30 నిముషాలైనా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను లైబ్రరీలకు తీసుకెళ్లాలని సూచించారు. ఎవరికి నచ్చిన పుస్తకం వారు ఆనందంగా చదువుకుంటే జ్ఞానం పెరుగుతుందన్నారు. రాష్ట్ర బాలోత్సవాల కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులను ఎటువంటి సంకోచం లేకుండా అనేక విషయాలు అడుగుతారని చెప్పారు. వారికి సమాధానం చెప్పకుండా విసుగు చెందు తామని, ఇది సరైనది కాదని అన్నారు. బాలోత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కథలు, పాటలు, చేతిరాత, చిత్రలేఖనం తదితర పోటీలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం గౌరవా ధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు మాట్లాడుతూ చందమామ, బాల సాహిత్యం కనుమరుగవ్వడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతిన్న తరువాత పిల్లలకు నానమ్మలు, అమ్మమ్మలు కథలు చెప్పే కాలం కనుమరుగైందన్నారు. బాలోత్సవం నిర్వహిస్తున్న ఇటువంటి వైజ్ఞానిక కార్యక్రమాలు ఎల్లవేళలా నిర్వహించాలని చెప్పారు, అందుకు తమ సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. కాన్ఫడరేషన్ ఆఫ్ అపార్ట్మెంట్స్ తాడేపల్లి అధ్యక్షులు జిఎస్ఆర్ మోహనరావు మాట్లాడుతూ సెల్‌ఫోన్‌ను పిల్లలు ఎక్కువగా వాడటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీయడానికి బాలోత్సవం చేస్తున్న కృషిని అభినంది ంచారు. అమరావతి ఐకాన్ మిత్ర బృందం తరుపున యడ్ల బాలకృష్ణ మాట్లాడుతూ అమరావతి ఐకాన్‌లో బాలోత్సవం పురుడు పోసుకోవడం తమకు గర్వంగా ఉందన్నారు. మ్యాథ్స్ లెక్చరర్ ఎస్.లెనిన్‌బాబు మాట్లాడుతూ 15 రోజుల పాటు జరిగిన ఈ శిక్షణలో లెక్కల పట్ల పిల్లల్లో ఉన్న భయాన్ని పోగొట్టామన్నారు. ఈ కార్యక్రమానికి వివిధ అపార్ట్ మెంట్ల నుంచి డాక్టర్లు, మేధావులు, పలువురు అభ్యుదయవాదులు తరలివచ్చారు. వేసవి శిక్షణా శిబిరం నిర్వాహకులు సంధ్యారాణి, రమ్య, కళ్యాణి, ఎస్.లెనిన్‌బాబు, డాన్స్ మాస్టర్ చందు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిన్నమనేని

బహుమతులు అందజేస్తున్న అచ్యుతరావు తదితరులు

వినతిపత్రం అందచేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుర్తింపు లేని కాలేజీలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంటూరు : గుర్తింపు లేని కళాశాలలను వెంటనే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.సమీర్, ఎం.కిరణ్ కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్ ఆర్ఐఒ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమ య్యాయని, కానీ అనేక మంది ప్రభుత్వం గుర్తింపు పొందకుండా కళాశాలలు, హాస్టల్స్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు. వారిపై వెంటనే చర్యలను తీసుకోవాలని కోరారు. ఒక కళాశాల పేరు మీద పర్మిషన్ తీసుకొని రెండు, మూడు చోట్ల తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. అటువంటి కళాశాలల మీద చర్యలు తీసుకొని వాటి గుర్తింపును రద్దు చేసి, విద్యార్థులను కాపాడాలన్నారు. కళాశాలలకు ఆట స్థలాలు కూడా లేక, బట్టీ చదువులతో విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. లక్షల రూపాయల ఫీజులను వసూలు చేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించని ఇంటర్మీడియట్ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు.యూనిఫారం, బుక్స్ కళాశాలలో తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని, వాటిని అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారన్నారు. ఎయిడెడ్ కళాశాలలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు యశ్వంత్, ఆరిఫా, షంషీద్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఈ నెల 4వ తేదీ మంగళవారం సాధారణ ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావుతో కలిసి ఇబ్రహీంపట్నం మండలం, జూపూడిలోని నిమ్రా కళాశాలలో కౌంటింగ్‌కు చేసిన ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా పరిశీలించారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న అబ్జర్వర్ దీపక్ మిశ్రా

బందోబస్తుపై అవగాహన

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు 2024 ప్రక్రియలో భాగంగా జూన్ 4న (నేడు) జరగబోవు కౌంటింగ్ కొరకు నిమ్రా, నోవా కాలేజ్ కౌంటింగ్ సెంటర్ల వద్ద ఏర్పాటుచేసిన బందోబస్తు సిబ్బందికి ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ కమీషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ, సిబ్బందికి కౌంటింగ్ డ్యూటీల్లో పాటించవలసిన నియమ నిబంధనల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుంటుపల్లి సిఎ కాన్వెన్షన్ హాలులో జరిగిన అవగాహన సదస్సులో బ్రీఫింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డిసిపి టి.హరికృష్ణ, వెస్ట్ డివిజన్ ఎసిపి పి.మురళీకృష్ణ రెడ్డి, ఇబ్రహీంపట్నం సిఐ ఎం.సత్యనారాయణ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సూచనలిస్తున్న సిపి పిహెచ్‌డి రామకృష్ణ

ఇంటర్నేషనల్ చెస్ టోర్నీలో 'రాకేష్' విద్యార్థిని

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంట్‌లో చిట్టినగర్‌లోని కెఎల్.రావు నగర్‌లో గల రాకేష్ హైస్కూల్ విద్యార్థినీ పాల్గొని మంచి స్కోరుతో తన సత్తా చాటుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి.రావు ఆధ్వర్యంలో చెస్‌లో సత్తా చాటిన విద్యార్థిని సోనికాకు సోమవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం సందర్భంగా సోనికాను శాలువా కప్పి సత్కరించారు. అనంతరం డాక్టర్ ఎన్.వి.రావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్పార్క్ చెస్ అకాడమీ మొదటి ఇంటర్నేషనల్ ఓపెన్ ఎఫ్ఐడిఇ టోర్నమెంట్‌లో తమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న డి.సోనికా అండర్-11 క్లాసిక్ చెస్‌లో తృతీయ స్థానం సాధించిందన్నారు. మూడు సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు 23 అవార్డులను సాధించిందని, అంతర్జాతీయంగా స్లాసిక్ చెస్ స్కోర్ 1445 రేటింగ్‌ను సాధించి భారతదేశంలోనే గర్వించదగ్గ చెస్ క్రీడాకారుల జాబితాలో స్థానం సంపాదించటం పట్ల సోనికాకు అభినందనలు తెలుపుతున్నా మన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, సాదికా, ప్రదీప్, జోజి, మెహరాజ్, మల్లీశ్వరీ సోనికాను అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

మాట్లాడుతున్న సిహెచ్.బాబూరావు

ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా ప్రజల తరుపున సిపిఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ ప్రజాసేవకు అంకితమవుతుందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని అజిత్ సింగ్‌నగర్, పాయికాపురం, సత్యనారాయణపురం, గవర్నర్ పేట ప్రాంతాల్లో సోమవారం అభినందన సభలు నిర్వహించారు. ఎన్నికల్లో ఇండియా వేదిక, సిపిఎం అభ్యర్థి బాబూరావు విజయం కోసం పనిచేసిన కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులను అభినందించారు. భవిష్యత్తులో ప్రజాసేవకు అంకితమై పనిచేస్తామని, ఉద్యమాల్లో భాగస్వాములమవుతామని అన్నారు. బాబూరావు మాట్లాడుతూ సిపిఎం నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడుతూ వారికి అండగా నిలుస్తుందని అన్నారు. డయేరియా, మంచినీటి కాలుష్యం సమస్యలపై నిత్యం అధికారులను ఎండగట్టారు. ఎన్నికల్లో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టిన పార్టీలు, నేతలు మొహం చాటేశారన్నారు. ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు బాధ్యతలు విస్మరించారన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంతో సహా రాష్ట్రంలో వైసిపి, టిడిపి, బిజెపిలు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.50 నుండి 100 కోట్ల రూపాయలు ఖర్చు చేశాయని అన్నారు. పట్టపగలు బహిరంగంగా ఓటర్లకు డబ్బు పంచారన్నారు. కొన్ని బూత్‌ల వద్ద మద్యం పంపిణీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, కే.శ్రీదేవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, కార్యదర్శివర్గ సభ్యులు కే.దుర్గారావు నాయకులు టి.ప్రవీణ్, సిహెచ్. శ్రీనివాస్, ఝాన్సీ, సరోజ, కష్ణమూర్తి, వై.సుబ్బారావు, పీర్ సాహెబ్, వెలగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - తిరువూరు : ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా తిరువూరు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం తిరువూరు నుండి లక్ష్మీపురం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామస్తులకు సైకిల్ రోజూ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ తాళ్లూరి రామకోటేశ్వరరావు వివరించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి బొల్లినేని రఘురాం అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో, గుళ్లపల్లి వెంకటరత్నం, ముత్యాల కిషోర్, నూతక్కి రాఘవరావు, దారా రామారావు, శ్రీనివాస్ వాకర్స్ క్లబ్ సభ్యులు, గ్రామ ప్రముఖులు మాయిరి వెంకటరమణ పాల్గొన్నారు.

అల్ట్రా ప్రీమియం టివిలపై సామ్‌సంగ్ ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, అల్ట్రా ప్రీమియం నియో క్యూఎల్‌ఇడి, ఒఎల్‌ఇడి, క్రిస్టల్ 4కె యుహెచ్‌డి టివిలతో సహా పెద్ద టీవీలపై అద్భుతమైన ఆఫర్లను ప్రకటించినట్లు సంస్థ ప్రతినిధి కె.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల వినోద అనుభవాన్ని మెరుగుపరచడానికి టీ20 క్రికెట్ ప్రపంచ కప్ కోసం 'బిగ్ టీవీ డేస్' ఆఫర్లు ప్రవేశపెట్టినట్లు తెలిపారు .'బిగ్ టీవీ డేస్' సమయంలో, కొనుగోలు చేసిన టీవీని బట్టి రూ.89,990 విలువైన సెరిఫ్ టీవీ లేదా రూ. 79,990 విలువైన సౌండ్‌బార్ ఉచితంగా పొందుతారని తెలిపారు. వినియోగదారులు రూ.2990 నుండి మొదలయ్యే సులభమైన ఈఎంఐని, 20 శాతం వరకు క్యాష్‌బ్యాక్‌ను కూడా పొందొచ్చన్నారు. ఈ ఆఫర్‌లు ఈ నెల 30వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రెగ్నెన్సీ డిటెక్షన్ కార్డుపై ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మ్యాన్‌కైండ్ ఫార్మాహౌస్ సంస్థ ప్రెగ్నెన్సీ డిటెక్షన్ కార్డు ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థమార్కెటింగ్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఛటర్జీ తెలిపారు. నగరంలోని మ్యాన్‌కైండ్ సంస్థ కార్యాలయంలో ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కచ్చితమైన గర్భధారణ ఫలితాలను అందించడంలో ప్రెగ్నెన్సీ డిటెక్షన్ కార్డు ఎంతో ఉపయగపడుతుందని తెలిపారు. అయితే దీనిపై విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కలిగించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నటి కాజల్ అగర్వాల్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనుందని తెలిపారు.

వినియోగదారులు సహకరించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: జగ్గయ్య పేట పట్టణం, మండలంలో కరెంటు పోయినప్పుడు వెంటనే ఇంట్లోనూ వ్యవసాయ బోర్లు వద్దా స్విచ్ ఆఫ్ చెయ్యాలని లేకుంటే వస్తువులు కాలే ప్రమాదం ఉందని ఎలక్ట్రికల్ అధికారులు హెచ్చరిస్తున్నారు. కరెంటు ఆపి మరలా ఆన్ చేసిన సమయంలో స్విచ్‌లు ఆన్‌లో ఉంటే ఓల్టేజ్ ఎక్కువగా వస్తుందని దీని వల్ల ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఫ్యూజులు పోతాయని, వైర్లు కాలిపోతాయని తెలిపారు. మరలా అన్నీ మరమ్మతులు చేసేందుకు చాలా సమయం పడుతుందని తెలిపారు. వినియోగదారులు గమనించి కరెంటు ఆపిన సమయంలో అన్ని స్విచ్‌లను ఆపాలని సూచించారు. అన్నీ వస్తువులకు ఎర్త్, స్టెబిలైజర్స్, కెపాసిటర్స్ పెట్టుకోవాలని ఎలక్ట్రికల్ అధికారులు తెలిపారు.

నందిగామలో మాక్ డ్రిల్‌లో భాగంగా ఆందోళన కారులను చెదరగొడుతున్న పోలీసులు

పోలీసుల మాక్ డ్రిల్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ గాంధీ సెంటర్లో సోమవారం సాయంత్రం పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రజలు నుండి స్పందన లభించింది. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు చేయకూడదని నందిగామ సీఐ హనీష్ హెచ్చరికలు జారీ చేశారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున విజయోత్సవ ర్యాలీలకు ఎటువంటి అనుమతులు లేవని సిఐ తెలిపారు. విజయవాడ కమిషనర్ ఆదేశాల మేరకు ఎసిపి రవికిరణ్ పర్యవేక్షణలో నందిగామ పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించామని సిఐ హనీష్ తెలిపారు. రియల్‌గా అనిపించిన మాక్ డ్రిల్ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో ఒకవైపు ఆందోళనకారులు మరోవైపు పోలీసులు ఆందోళనకారులు పోలీసులపై రాళ్ల విసిరిన ఆందోళనకారులు బాష్ప వాయు ప్రయోగించిన పోలీసులు అక్కడికి ఆందోళనకారులు తగ్గకపోవడంతో లాఠీచార్జ్ చేసి పోలీసులు ఆందోళనకారులను చెల్లాచెదరు చేశారు. ఇదంతా నిజమే ఏమో అని భయభ్రాంతులకు గురయిన చుట్టుపక్క ప్రజలు అయితే ఇది చివరగా మాక్ డ్రిల్ అని తెలియడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

గొడవలు చేసే వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు. కవ్వింపు చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హనీష్ హెచ్చరించారు.

ఇబ్రహీంపట్నంలో భద్రతా వలయం ఏర్పాటు చేసిన సిబ్బంది

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు: డిసిపి రామకృష్ణ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కౌంటింగ్ సమయంలో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందేనని డిసిపి రామకృష్ణ తెలిపారు. నిబంధన అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలను వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లు సైతం నిబంధన ప్రకారం నడుచుకోవాలని ఎలాంటి గొడవలకు ప్రేరేపించినా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బంది కలిగిన, కౌంటింగ్ విషయంలో సమస్యలు తలెత్తినా అధికారులకు సమాచారం ఇవ్వాలని, ఎలాంటి ప్రేరేపిత సంఘటనలకు పూనుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పూర్తి భద్రత వలయంలో కౌంటింగ్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలకు దూరంగా ఉండాలని, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. అలాంటి చర్యలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

భద్రతా వలయం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4న ఇబ్రహీంపట్నంలోని నిమ్రా- నోవా వద్ద కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి గానూ కౌంటింగ్ జరగనుంది. దీంతో ఇబ్రహీంపట్నంలో పోలీసులు బందోబస్తు కట్టుదిట్టం చేశారు. ఇబ్రహీంపట్నం చుట్టూ భద్రతా వలయం ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందువలన ఎక్కడ కూడా నలుగురికి మించి జనాలు గుమ్మికూడి ఉండకూడదన్నారు. అలా ఉన్నా చోట కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల సమీపంలో అనుమతులు లేకుండా ఎవరు రావద్దని హెచ్చరించారు. దూర ప్రాంతాల నుండి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో ఎవరూ తిరగకూడదని, లాడ్జిలు, ఫంక్షన్ హాల్‌లు ఎలాంటి సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతున్న డిసిపి రామకృష్ణ

గంపలగూడెం : మండలంలో ఎక్కడైనా పార్టీపరమైన వ్యంగ్యాస్త్రాలు సంధిస్తే కఠిన చర్యలు చేపడతామని గంపలగూడెం ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం మండలంలో తునికిపాడు గ్రామంలో పోలీసు బలగాలతో మోహరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా అల్లర్లు సృష్టించడానికి ప్రయత్నిస్తే తమకు తెలియజేయాలని, అటువంటి వారిపై ఉక్కు పాదం మోపుతామన్నారు. కౌంటింగ్ నేపథ్యాన్ని సజావుగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

గంపలగూడెంలో మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.